

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 04-02-2026 సంపుటి : 07 సంచిక 261 పేజీలు : 8 వెల : రూ 3-00


# తిరుమల పవిత్రతను కాపాడి తీరుతాం..

## ఎన్డీయే నేతలతో సీఎం చంద్రబాబు



అమరావతి, ఫిబ్రవరి 3: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన కార్యాచరణను ముమ్మరం చేసింది. కేబినెట్ సమావేశానికి ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన నివాసంలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో కీలక భేటీ నిర్వహించారు. శ్రీవారి ప్రసాదం పవిత్రతను దెబ్బతీసిన వారిని వదిలే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, 'తిరుమల కల్తీ లడ్డూ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ కోణం చూడటం లేదు. ఇది కేవలం రాజకీయ విమర్శలకు పరిమితం కావాల్సిన అంశం కాదు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు, శ్రీవారి పవిత్రతకు సంబంధించిన అంశం. ఆ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని సహచర నేతలకు వివరించారు. ఈ కుట్ర వెనుక ఉన్న నిందితులను నిగ్గుతేల్చేందుకే విచారణ కమిటీని ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేయటాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలకు తాము పూర్తి మద్దతు ఇస్తున్నామని ఆయన చంద్రబాబుకు స్పష్టం చేశారు. పవిత్రమైన ఆలయ ప్రాభవాన్ని దెబ్బతీసిన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు. బీజేపీ తరపున మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఈ విషయంలో కూటమిలో పూర్తి ఏకాభిప్రాయం ఉందని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన ఈ కుట్రలను ప్రజల ముందు పెట్టి, క్షేత్రస్థాయిలో వారిని ఎండగట్టాలని ఆయన అభిప్రాయపడ్డారు. తిరుమల ఆలయ పవిత్రత, ప్రసాదాల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని, దోషులను విచారణ ద్వారా బహిర్గతం చేస్తామని కూటమి నేతలు ముక్తకంఠంతో తీర్మానించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలోని 1వ బ్లాక్ లో రాష్ట్ర క్యాబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను క్యాబినెట్ తీసుకుంది.

# అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఈ శతాబ్దపు అతిపెద్ద డీల్: ప్రధాని మోదీ



ఢిల్లీ, ఫిబ్రవరి 03: అమెరికా-భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందానికిఅంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. దీంతో ఇకపై భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాలు 18 శాతానికి తగ్గాయి. ఈ విషయంలో దక్షిణాసియాలోని పొరుగుదేశాల కంటే మన దేశవే పైచేయి సాధించినట్లయింది. బంగ్లాదేశ్, శ్రీలంకపై టారిఫ్‌లు 20 శాతం కాగా.. పాకిస్థాన్‌పై 19 శాతం, చైనాపై 34 శాతం వరకు సుంకాలు ఉన్నాయి. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని(ట్రేడ్ డీల్) 'ఈ శతాబ్దపు అతిపెద్ద ఒప్పందం'గా ప్రధాని మోదీ అభివర్ణించారు. ఇది అంతర్జాతీయంగా పెరుగుతున్న భారత దేశ ప్రాముఖ్యతను మరింత పెంచుతుందని తెలిపారు. మంగళవారం ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత్, అమెరికా మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ కారణంగా ఇరు దేశాల పరస్పర సుంకాలు ప్రస్తుతం ఉన్న 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గాయని వెల్లడించారు. ప్రపంచ వ్యవహారాల్లో, సమతుల్యతను కాపాడుకోవడంలో భారత దేశ పాత్ర మరింత పెరుగుతుందని ఎన్డీఏ ఎంపీలతో ఆయన అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో కొంతమంది తీవ్ర నిరాశకు గురయ్యారని ప్రతిపక్ష పార్టీలను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ హాస్యంగా వ్యాఖ్యానించారు. భారత ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, ఎగుమతులు పెరిగేందుకు ఈ ఒప్పందం ఎంతో ఉపకరిస్తుందని ప్రధాని మోదీ వెల్లడించారు. మరోవైపు ఈ సమావేశంలో ఎన్డీఏ ఎంపీలు ప్రధాని నరేంద్ర మోదీని సత్కరించారు.

# 140 కోట్ల భారతీయులకు మేలు చేసే డీల్..

## యూఎస్‌తో వాణిజ్య ఒప్పందంపై పీయూష్ గోయల్



న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం రైతుల నుంచి మత్స్యకారుల వరకూ దేశంలోని 140 కోట్ల మందికి ప్రయోజనకారిగా ఉంటుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఇరుదేశాల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం, ఆ విషయాన్ని ప్రధానమంత్రి మోదీ ధ్రువీకరించడం అనేక ప్రశ్నలకు తావిచ్చింది. దీంతో ఈ ట్రేడ్ డీల్‌కు సంబంధించిన కొన్ని వివరాలను మీడియోతో పీయూష్ గోయల్ పంచుకున్నారు. పార్లమెంటులో ఈ (ట్రేడ్ డీల్) వివరాలను పంచుకోవాలని తాను అనుకున్నానని, అయితే లోక్‌సభలో ఈరోజు ఎంత రభస జరిగిందో అందరూ చూశారని గోయల్ అన్నారు. సభలో జరిగిన దానికి రాహుల్ గాంధీని ఆయన తప్పుపట్టారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే ఆముద్రిత పుస్తకం నుంచి విపక్ష నేత కొన్ని అంశాలను ప్రస్తావించేందుకు చేసిన ప్రయత్నవే ఈ రభసకు కారణమని అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తనకున్న మైత్రీ సంబంధాలను ఉపయోగించుకుని ఈ ప్రాంతంలోనే మనం పోటీ పడే అన్ని దేశాల కంటే బెస్ట్ డీల్‌ను ప్రధానమంత్రి మోదీ కుదుర్చుకున్నారని పీయూష్ గోయల్ తెలిపారు. 'ఎన్నో సవాళ్లు ఉన్నాయి. 50 శాతం టారిఫ్‌లను భారత్ ఎదుర్కొంది. రైతులు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతి దారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డీల్ ఎప్పుడు కుదురుతుందంటూ కొద్ది రోజుల క్రితం వరకూ విపక్షాలు మమల్ని అడుగుతూనే ఉన్నాయి. నెలల తరబడి ఈ డీల్ పొందలేకపోయాం. కానీ ప్రధాని తనకున్న మైత్రీ సంబంధాలను ఉపయోగించుకుని గొప్ప డీల్ కుదిర్చారు. ఈ డీల్‌తో భారత్‌కు ఎన్నోవిధాలుగా మేలు జరుగుతుంది' అని గోయల్ వివరించారు. వ్యవసాయరంగం పరిరక్షణపై వ్యక్తమవుతున్న అనుమానాలపై మాట్లాడుతూ, వ్యవసాయం, పాడిరంగం పరిరక్షణపై మొదట్నించీ మోదీ దృష్టిసారించారని, వాటికి ఎలాంటి చెడు జరదగని చెప్పారు. సముద్ర ఉత్పత్తులను ఎగుమతి చేసే మత్స్యకారులు ఈ డీల్ తర్వాత పండుగ చేసుకుంటారని, భారత ఉజ్వల భవిష్యత్తుకు ఈ డీల్ సంకేతమని చెప్పారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, టెక్స్‌టైల్స్, మెరైన్ గూడ్స్, జెమ్స్, జ్యూయెలరీ రంగాలకు చాలా ప్రయోజనాలు చేకురుతాయని పీయూష్ గోయల్ వివరించారు.

# బడ్జెట్ సమావేశాలు..

## 8 మంది ఎంపీలను సస్పెండ్ చేసిన స్పీకర్

న్యూ ఢిల్లీ, లోక్‌సభలో తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. స్పీకర్ వైపుగా కాగితాలను విసిరినందుకు వారిపై సస్పెన్షన్ వేటు పడింది. కాంగ్రెస్‌కు చెందిన ఎంపీలు మాణిక్కం ఠాగూర్ (తమిళనాడు ఎంపీ), గుర్జీత్ సింగ్ ఔజ్లా (పంజాబ్), అమరీందర్ సింగ్ రాజా(పంజాబ్), కిరణ్ కుమార్ రెడ్డి (తెలంగాణ), హిబీ ఈడెన్ (కేరళ), డీన్ కురియకోస్ (కేరళ), ప్రశాంత్ పడోలేతో (మహారాష్ట్ర) పాటు సీపీఎమ్‌కు చెందిన ఎస్ వెంకటేశన్‌లు (తమిళనాడు) మిగిలిన బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకూడదంటూ లోక్‌సభ స్పీకర్ సస్పెండ్ చేశారు. ఎంపీలపై చర్య కోరుతూ కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించడంతో సస్పెన్షన్ వేటు పడింది భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు.






# వారంతా నేరస్థులే.. కల్తీ నెయ్యిపై మంత్రి పయ్యావుల



అమరావతి, ఫిబ్రవరి 3: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి అంశంపై ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సిట్ ఇచ్చిన నివేదికలో నివ్వెరపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. నెయ్యిలో కెమికల్స్, ఇతర ఫ్లేవర్స్ కలిపారన్నారు. వైసీపీ నేతలు కల్తీని సహజం అంటున్నారని మండిపడ్డారు. తెలిసి కూడా వారు మౌనంగా ఎందుకు ఉన్నారనేది తేలాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్డీయే పక్ష సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు... జంతు కొవ్వు అవశేషాలు ఉన్నాయని చెప్పడంతో ఈ అంశంపై చర్చ జరిగినట్టు తెలిపారు. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న ఎన్‌డీటీబీ రిపోర్టు ఆధారంగా ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. నెయ్యి పరీక్షల్లో 'ఎస్ వాల్యూ'లో తేడా ఉందని, అంటే.. సస్పెక్టెడ్ అడల్టరేషన్ జరిగే అవకాశం ఉందన్నారు. సోయాబీన్, కోకోనట్, పామ్ ఆయిల్, ఫిష్ ఆయిల్, లార్డ్ వంటి అవశేషాలు ఉండే అవకాశం ఉందని నివేదికలో వెల్లడైందని మంత్రి అన్నారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రెండు పోస్టింగుల్లో టీటీడీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో)గా శ్యామల రావును నియమించారని తెలిపారు. దీంతో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయన్నారు. 2022 ఆగస్టు 3న బీటా సిటోస్టెరాల్ ఉన్నట్టు రిపోర్టు వచ్చినప్పటికీ, దాన్ని కొనసాగిస్తూ తప్పును కప్పిపుచ్చారని మంత్రి ఆరోపించారు. పూర్తిగా టెండర్ నిబంధనలు ఉల్లంఘించారని విమర్శించారు మంత్రి పయ్యావుల. ఫేక్ డాక్యుమెంట్లతో టెండర్లు కేటాయించారని ధ్వజమెత్తారు. ఇందులో భాగస్వాములైన అందరినీ నేరస్థులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. తిరుమల శ్రీవారికి జరిగిన అపచారంలో సుబ్బారెడ్డి, ధర్మారెడ్డి సహా పలువురు అధికారులు ఉన్నారన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సిట్ చెప్పిందన్నారు. బాలాజీ, ధర్మారెడ్డి, సింఘాల్‌పై చర్యలకు సిట్ సిఫార్సు చేసినట్లు వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా తప్పులు చేశారని సిట్ పేర్కొందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# సంపాదకీయం

బుధవారం 04-02-2026

## బంగారం, వెండి ధరలు

### ఎందుకు తగ్గుతున్నాయి? ఎందుకు పెరుగుతున్నాయి..?

బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయికి చేరుకున్న తరువాత ఒక్కసారిగా పతనం మొదలైంది. ఆ పతనం ఇంకా కొనసాగుతోంది.ప్రపంచ సంక్షోభం కారణంగా గత సంవత్సరం రికార్డు స్థాయిలను తాకినప్పటికీ, గత మూడు, నాలుగు రోజులుగా బంగారం, వెండి ధరలు గణనీయంగా తగ్గాయి. తత్ఫలితంగా, ఈ తగ్గుదల సమయంలో బంగారం, వెండిని కొనడం మంచిదేనా లేదా ధరలు మరింత తగ్గే వరకు వేచి ఉండటం మంచిదా అని పెట్టుబడిదారులు ఆలోచిస్తున్నారు. నిజానికి, ఈ వారం రికార్డు గరిష్టాలను చేరుకున్న తర్వాత బులియన్ మార్కెట్లో గణనీయమైన తగ్గుదల డాలర్ బలోపేతం కావడం, అమెరికా ద్రవ్య విధానంపై పెరుగుతున్న అంచనాల కారణంగా నమ్ముతారు. అంతర్జాతీయంగా ఏర్పడిన అస్థిర పరిస్థితుల మధ్య బంగారంలో పెట్టుబడి పెట్టడం సురక్షితంగా భావించడంతో జనవరిలో పుత్తడి ధరలు కొత్త రికార్డులను తాకాయి.అయితే, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ చీఫ్‌గా సెంట్రల్ బ్యాంక్ మాజీ గవర్నర్ కెవిన్ వార్ష్ పేరు ప్రతిపాదించిన తరువాత మార్కెట్లలో లోహాల ధరలు శుక్రవారం పతనం కావడం ప్రారంభమైంది.వార్ష్ పేరును ఫైనాన్షియల్ మార్కెట్లు స్వాగతించాయి. శుక్రవారం అనేక దేశాల కరెన్సీలతో పోల్చినప్పుడు డాలర్ విలువ 1 శాతం పెరిగింది.డాలర్ పుంజుకోవడంతో, 1983 తర్వాత బంగారం ధరల్లో ఒకే రోజు ఈ స్థాయిలో భారీ పతనం నమోదైంది. బంగారం ధర 9 శాతం, వెండి ధర 27శాతం పడిపోయింది.బంగారం, వెండి ధరలు తగ్గడానికి ప్రధాన కారణం ట్రంప్ పరిపాలన అమెరికా ఫెడరల్ రిజర్వ్ అధిపతిగా కెవిన్ వార్ష్‌ను నామినేట్ చేస్తుందనే ఊహాగానాలు పెరుగుతున్నాయి. ఇది వడ్డీ రేటు తగ్గింపు అంచనాలను పెంచింది, ఇది డాలర్, విలువైన లోహాలపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపింది. ఇంకా, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, దీర్ఘకాలిక విధాన సంకేతాలు కూడా మార్కెట్‌ను ప్రభావితం చేశాయి.దేశీయంగా, బడ్జెట్ 2026లో బంగారం, వెండికి సంబంధించి ఎటువంటి ప్రధాన ప్రకటనలు లేవు. దేశీయంగా గట్టి మద్ధతు ఇచ్చే ప్రకటలు కూడా లేకపోవడం కూడా మరో కారణం. మార్కెట్లు ఇప్పుడు రాబోయే అర్బీఐనిర్ణయాలు, యూఎస్ ఉపాధి డేటా, పిఎంఐ డేటాపై దృష్టి సారించాయి, ఇవి ధరలు స్థిరీకరిస్తాయా లేదా మరింత అస్థిరతను చూస్తాయా అని నిర్ణయిస్తాయి.ప్రస్తుతానికి బంగారం, వెండి ధరల్లో అనిశ్చితి కొనసాగుతుందని నిపుణులు భావిస్తున్నారు. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సీనియర్ విశ్లేషకుడు మానవ్ మోడీ ప్రకారం, రాబోయే కాలంలో ఈ లోహాల ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉండవచ్చు, కాబట్టి పెట్టుబడిదారులు జాగ్రత్తగా ముందుకు సాగాలి. ఇంతలో, ఆదివారం వరుసగా రెండో రోజు కూడా తగ్గుదల కొనసాగింది, ఫ్యూచర్స్ ట్రేడింగ్‌లో వెండి ధరలు కిలోగ్రాముకు తొమ్మిది శాతం తగ్గి ?2.65 లక్షలకు చేరుకోగా, బంగారం మూడు శాతం తగ్గి 10 గ్రాములకు ?1.47 లక్షలకు చేరుకుంది.మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఓఅచీ)లో మార్చి నెలలో డెలివరీ చేయాల్సిన వెండి ధరలో సర్క్యూట్‌ను తాకింది. ఏఓ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇఃఉ-కమోడిటీ ఉ కరెన్సీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ ప్రణవ్ మీర్ ప్రకారం, దేశీయ మార్కెట్లో బంగారం దాని ఆల్-టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి దాదాపు 20 శాతం తగ్గింది, వెండి దాదాపు 37 శాతం తగ్గింది, ఇది ఇటీవలి లాభాల బుకింగ్, ధరలలో ర్యాలీ తర్వాత సహజ క్షీణతను ప్రతిబింబిస్తుంది.విలువైన లోహాలకు 2025 అద్భుతమైన సంవత్సరంగా నిలిచింది. 1979 తర్వాత బంగారం అత్యధిక వార్షిక లాభాల్ని నమోదు చేసింది.ట్రంప్ సుంకాల భయాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన షేర్ల ధరలు పెరగవచ్చనే అంచనాలమధ్య ఫైనాన్షియల్ మార్కెట్లలో ఆందోళన ఏర్పడటంతో బంగారం, వెండి ధరలు కొత్త రికార్డుల్ని తాకాయి.బంగారం ధర ఈ ఏడాది జనవరి చివరి నాటికి 5,500 డాలర్లను దాటింది, వెండి ధర కూడా 'ఆల్‌టైమ్ హై'కి చేరింది.2026లో ఫెడరల్ రిజర్వ్ రెండుసార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని వాల్‌స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గితే బంగారం ఆకర్షణీయ పెట్టుబడిగా మారుతుంది.బంగారం ధరలు పెరగడానికి మరో పెద్ద కారణం లభ్యత. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ట్రేడ్ అసోసియేషన్ ప్రకారం ఇప్పటి వరకు 216,265 టన్నుల బంగారాన్ని మాత్రమే వెలికి తీశారు.కొన్నేళ్ల క్రితం వివిధ దేశాల కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొనుగోలు చేయడం మొదలు పెట్టడంతో బంగారం ధరలు పెరగడం మొదలైంది.అయితే గత ఏడాది కాలంలో అమెరికా సుంకాల వంటి అంతర్జాతీయ పరిణామాలు బంగారాన్ని మరింత ఆకర్షణీయ పెట్టుబడిగా మార్చాయి.ఆర్థికపరమైన ఆందోళనలు కూడా బంగారం విలువ పెరగడానికి కారణమైనప్పటికీ, పరిస్థితులు చక్కబడినప్పుడు లేదా లాభాలు చాలని ఇన్వెస్టర్లు భావించినప్పుడు ధరలు అంతే తేలిగ్గా పడిపోవచ్చు.అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలోనూ ఇదే ట్రెండ్ కొనసాగింది. ముడి చమురు ధర 5 శాతానికి పైగా తగ్గింది.ప్రధాన చమురు ఉత్పత్తి సంస్థలు, యథాతథ స్థితిని కొనసాగించాలని నిర్ణయించడం, అమెరికా ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గొచ్చన్న సంకేతాలు వంటివి చమురు ధరలు తగ్గడానికి కారణాలుగా భావిస్తున్నారు.దీంతో పాటు అమెరికా డాలర్ విలువ పెరగడం కూడా ముడి చమురు ధరల తగ్గుదలపై ప్రభావం చూపింది.చమురు ధరను డాలర్లలో నిర్ణయిస్తారు. డాలర్ విలువ పెరిగే కొద్దీ అమెరికాయేతర దేశాలకు ముడి చమురు మరింత ఖరీదైనదిగా మారుతుంది.

## కాంగ్రెస్... బిజెపికి మధ్యలో సింహం

- పురపోరుకు సమాయత్తం - కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో మూడో వంతు బి.ఆర్ ఎస్ వారే
- బిఆర్ఎస్ పై ఆసక్తి చూపని పలువురు అభ్యర్థులు
- బలంగా కనిపిస్తున్న సింహం
- సింహం అభ్యర్థులు ఎంపికలో ఆచుతూచి నిర్ణయం
- జాగృతి ప్రచారంతో సింహంకు పెరగనున్న బలం



పెద్దపల్లి :పెద్దపల్లి పుర పోరులో ఆయా పార్టీల నాయకులు తమ ఆయుధాలను సిద్ధం చేసుకుం టున్నారు. నామినేషన్ల ప్రక్రి య పూర్తి చేసుకున్న ఆయా పార్టీల అభ్యర్థులు తమ బీఫా రాలను ఎన్నికల అధికారుల కు సమర్పించారు. నేటితో నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయింది. ఇక రేపటి నుండి అభ్యర్థుల ప్రచారాల్లో తలమునకలై సాగనున్నారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో ఎవరికి వారే గెలుపు తమదే అన్న రీతిలో ప్రచారాలు సాగిస్తున్నారు. పైకి కనిపించకుండా ఎవరి లెక్క లు వారివే అన్నట్టు వారి వారి ప్రయత్నాల్లో మునిగి తేలుతు న్నారు. ఈ క్రమంలో ప్రధానం గా బిజెపి, కాంగ్రెస్ మధ్య పో టీ ఉంటుందనే విషయాన్ని గ్ర హిస్తే అందులో సింహం గుర్తు ఏఐఎఫ్ బీ అనే పార్టీ వచ్చి చేరింది. బీసీ కార్డుతో ముందుకు వచ్చి, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ప్రకటించుకొని గెలుపు ధీమాతో ఉన్న మాజీ కౌన్సిలర్ కొలిపాక శ్రీనివాస్ 26 మంది అభ్యర్థులతో నామినేషన్ వేయించాడు. ఈ పార్టీ ప్రచారం కోసం జాగృతి రాష్ట్ర వ్యవస్థాపకులు, మాజీ ఎమ్మె ల్సీ కవిత రానున్నారు. కానీ ఒక విషయం ఆలోచన చేస్తే పెద్దపల్లిలో మాత్రం పార్టీలతో సంబంధం లేకుండా వ్యక్తులను చూసి ఓట్లు వేసే సంప్రదాయం ఉంది. ఎక్కువ గా అధికార పార్టీ ఏది ఉంటే దానికే బలం ఉంటుందనేది గత పదేళ్లుగా మనం చూస్తూ నే వున్నాము. కానీ పెద్దపల్లి లో మాత్రం ఎవరికి అవకాశం ఇస్తారో ఎవర్ని తొక్కేస్తారనే విషయం మాత్రం ఇక్కడి ఓటర్ల నిర్ణయమే. గత ఎన్నిక ల అంశాలను పరిశీలిస్తే ఈ విషయం చాలా సూటిగా కనిపిస్తున్నది. ఇక ప్రస్తుత మున్సిపల్ పోరులో మాత్రం కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థు ల్లో మూడోవంతు మంది టిఆర్ఎస్ పార్టీ నుండి వచ్చిన వారే. ఇందులో చాలామంది గతంలో చేసిన కొన్ని పొరపా ట్లు, అవినీతి, ప్రజల వద్ద డబ్బులు దండుకోవడం వల్ల వారికి గెలుపు పెద్ద సమస్యగా మారనున్నదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అందుకే చాలామంది కాంగ్రెస్ లో చేరి పార్టీ కండువా కప్పుకొని బీఫామ్ టికెట్ పొందారు. అ యితే అప్పటికే టికెట్ ఆశిస్తున్నా కాంగ్రెస్ లోని చాలామంది అభ్యర్థులు, సీనియర్లు వారి రాకను వీళ్ళు జీర్ణించుకోలేకపోతున్నారు. ఓ పక్క బీసీలకు 42 శాతం రిజ ర్వేషన్ తో పలువురి స్థానాలు కూడా మారాయి. దీనివల్ల కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపు విషయంలో భయాందోళనలో వున్నారు. ఇక అసలు విష యానికి వస్తే బిఆర్ఎస్ పైన కొంత వ్యతిరేకత ఉన్నవాళ్లు కాంగ్రెస్ కు మద్దతు ఇచ్చే అవకాశం ఉండేది కానీ ఇప్పుడు ఆ బిఆర్ ఎస్ వాళ్లే కాంగ్రెస్ లో చేరడంతో ఇటు బిఆర్ఎస్ కు కాకుండా అటు కాంగ్రెస్ కు కాకుండా సింహాని కి లేదా బిజెపికి ఓట్లు వేసే అవకాశం ఉందని విశ్లేషకుల అభిప్రాయంగా పేర్కొంటున్నా రు. బీజేపీలో ఒక అంశం తీసు కుంటే ఇప్పటికీ వర్గ పోరు, అంతర్గత విభేదాలు నాయకు ల్లో బహిరంగంగానే బయటప డిన సంఘటనలు ఉన్నాయి. అలాగే ప్రస్తుతం బీసీ కార్డు ఉద్యమం బలంగా ఉండటం, దీనికితోడు సింహం గుర్తుపై పోటీ చేసే అభ్యర్థుల్లో కొంత మందికి అన్ని వర్గాల నుండి సానుభూతి, జాగృతి తరుపు న కవిత రావడం ద్వారా కూ డా టిఆర్ఎస్ నుండి ఓట్లు పడే అవకాశాలు కనిపిస్తున్నా యి. ఇది వారి ఓటు బ్యాంకు కు కలిసి వచ్చే అంశాలుగా ఉన్నాయి.

## ఎంజీయూ పరిధిలో రేపటి నుండి బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ పరీక్షలు

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలు

### హాజరు కానున్న 5,730 మంది విద్యార్థులు



రామగిరి, ఫిబ్రవరి 03 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ పలు సెమిస్టర్ థియరీ పరీక్షలు ఈ నెల 4 నుండి ప్రారంభం కానున్నాయి. మొత్తం 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా 5,730 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి డా జి.ఉపేందర్ రెడ్డి తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సెమిస్టర్ -1, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సెమిస్టర్ -3 పరీక్షల నిర్వహణ జరుగుతుందన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 11న నిర్వహించే పరీక్షలను వాయిదా వేసినట్లు వర్సిటీ సీఈఓ డా. జి.ఉపేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆ రోజు నిర్వహించాల్సిన బీపీఈడీ, డీపీఈడీ పరీక్షలను ఈ నెల 13న అలాగే బీఈడీ పరీక్షలను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారిన షెడ్యూల్‌ను ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు గమనించి పరీక్షకు హాజరు కావాలని సూచించారు.భువనగిరిలో- 2. సూర్యాపేట, కోదాడలో- 2. మిర్యాలగూడ, నల్లగొండలో- 2 కొండమల్లేపల్లిలో- 2, మాల్, చౌటుప్పల్‌లో-1 పరీక్ష కేంద్రం మొత్తం 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. బీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2 వేల మంది. మూడవ సెమిస్టర్ పరీక్షలకు 2,793 మంది హాజరవుతున్నారు. అలాగే బీపీఈడీ, డీపీఈడీ ప్రథమ సెమిస్టర్ పరీక్షలకు 400 మంది విద్యార్థులు హాజరు కానున్నారు.

## జైలు నుంచి రిలీజైన బిక్రం సింగ్ మజితియా



చండీఘడ్: శిరోమణి అకాలీదల్ నేత, పంజాబ్ మాజీ మంత్రి బిక్రం సింగ్ మజితియా ఇవాళ నాభా జైలు నుంచి బయటకు వచ్చారు. అక్రమాస్తులు కలిగి ఉన్న కేసులో సోమవారం సుప్రీంకోర్టు ఆయనకు బెయిల్ మంజూరీ చేసిన విషయం తెలిసిందే. న్యాయపరమైన ప్రక్రియ వల్ల మతిజియా రిలీజై ఆలస్యమైంది. ఆయనకు స్వాగతం పలికేందుకు భార్యతో సహా పార్టీ వర్కర్లు జైలు వద్దకు వెళ్లారు. జైలు నుంచి బయటకు రాగానే మజితియా తన సహజరీతిలో మీసాలను మెలేశారు. ఓపెన్ టాప్ జీప్‌లో తన మద్దతుదారులతో కలిసి వెళ్లారు.దాదాపు రూ.700 కోట్ల అక్రమాస్తులు కలిగి ఉన్నారని శిరోమణి అకాలీదల్ నేత బిక్రం సింగ్ మజితియా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన సుప్రీం ధర్మాసనం సోమవారం బెయిల్‌పై ఆదేశాలు జారీ చేసింది. కేసు పూర్వాపరాలు, విచారణ తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని నిందితుడికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు సుప్రీం పేర్కొంది.అక్రమాస్తుల కేసుకు సంబంధించి బిక్రం సింగ్‌పై సిట్ 2025 జూన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఆ వెంటనే అతడిని అమృత్ సర్‌లోని తన ఇంటి నుంచి పంజాబ్ విజిలెన్స్ బ్యూరో (వీబీ)కి చెందిన పోలీసులు అరెస్టు చేశారు. అప్పటినుంచి అతడు న్యూ నభా జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు. దీంతో బిక్రం సింగ్.. పంజాబ్, హరియాణా హైకోర్టులో గతంలోనే బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఈ బెయిల్ పిటిషన్‌ను కొట్టివేసింది. తర్వాత అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించగా బెయిల్ మంజూరు చేసింది.మరోవైపు ఈ కేసులో గత ఆగష్టులోనే పోలీసులు సప్లిమెంటరీ ఫైల్స్‌తోకలిపి 40,000 పేజీల చార్జిషీటు దాఖలు చేశారు. పంజాబ్‌కు చెందిన మజితియా శిరోమణి అకాళిదల్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి, క్యాబినెట్ మంత్రిగా కూడా పని చేశారు. ఈ సమయంలో ఆయన అవినీతికి పాల్పడ్డాడనే ఆరోపణలొచ్చాయి. 2007-2017 మధ్య కాలంలో ఆయన, అతడి భార్య కలిపి వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలు రావడంతో పంజాబ్ విజిలెన్స్ రంగంలోకి దిగి విచారణ జరుపుతోంది.

## మంథని మాజీ శాసనసభ్యుడు చంద్రుపట్ల రాంరెడ్డి మృతి

-ఈ నెల5న ముత్తారం మండలం సీతంపల్లిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో జరగనున్న అంత్యక్రియలు

-సంతాపం ప్రకటించిన వివిధ పార్టీల నాయకులు, నియోజకవర్గ ప్రజలు

మంథని ,మంథని మాజీ శాసనసభ్యుడు చంద్రుపట్ల రాం రెడ్డి(80) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. అనారోగ్యం కారణంగా నెల రోజులుగా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఆయన మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే రాం రెడ్డి పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామంలో 18 మార్చి1947లో చంద్రుపట్ల వెంకటరెడ్డి-అనసూయమ్మ దంపతులకు జన్మించారు. రాంరెడ్డికి ఇద్దరు కుమారులు ఆయన పెద్ద కుమారుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి తండ్రిని ఆదర్శంగా తీసుకొని రాజకీయాలపై ఆసక్తితో విదేశాలలో ఉన్నత ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఇప్పుడు బిజెపి మంథని నియోజకవర్గం ఇన్చార్జిగా,రాష్ట్ర నాయకుడిగా పనిచేస్తున్నారు. ఆయన చిన్న కుమారుడు అనిల్ రెడ్డి విదేశాల్లోనే స్థిరపడ్డాడు. రాంరెడ్డి ముత్తారం మండలం ఖమ్మంపల్లి సర్పంచ్ గా రాజకీయ ప్రస్థానం మొదలు పెట్టి ముత్తారం ఎంపీపీగా, మంథని శాసనసభ్యునిగా ఎదిగారు. 1994 నుండి 1999వరకు తెలుగుదేశం పార్టీ తరపున మంథని శాసనసభ నియోజకవర్గం నుండి రాంరెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించాడు. తెలుగుదేశం పార్టీతో తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రాంరెడ్డి, 1994లో జరిగిన ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరపున మంథని శాసనసభ నియోజకవర్గం నుండి పోటిచేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దుద్దిల్ల శ్రీపాద రావుపై 21,155 ఓట్ల మెజారిటీతో గెలుపొంది తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టాడు. శ్రీపాదరావు మరణానంతరం 1999లో జరిగిన ఎన్నికల్లో దుద్దిళ్ళ శ్రీధర్ బాబు చేతిలో 15,271 ఓట్ల తేడాతో ఓడిపోయారు. తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం తరువాత కెసిఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీలో చేరాడు. టిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి 2021 ఏప్రిల్ 3న తన కుమారుడు చందుపట్ల సునీల్ రెడ్డితో కలిసి బిజేపిలో చేరాడు.ముఖ్యంగా రైతుల కష్టాలు, గ్రామీణాభివృద్ధి అంశాలపై ఆయన చూపిన చిత్తశుద్ధి ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. పదవుల కంటే ప్రజలే ముఖ్యమని నమ్మిన నేతగా, రాజకీయాలకు మానవత్వాన్ని జోడించిన వ్యక్తిగా రాంరెడ్డి గుర్తుండిపోతారు. రైతు పక్షపాతిగా, ప్రజల మనిషిగా ఆయన సంపాదించిన గౌరవం అపారమైనది. మంచితనానికి మారుపేరుగా నిలిచిన ఆయన ఇక లేరన్న నిజం మంథని ప్రజలకు తీరని లోటుగా మారింది. రామ్ రెడ్డి భౌతికకాయాన్ని బుధవారం మంథనికి తీసుకురానున్నారు. గురువారం ఉదయం అంత్రక్రియలను ముత్తారం మండలం సీతంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వారి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించనున్నారు. ఆయన చిన్న కుమారుడు అనిల్ రెడ్డి అనారోగ్యంతో ఉన్న తండ్రిని చూసి సోమవారం రాత్రి హైదరాబాదు నుండి అమెరికాకు బయలుదేరి వెళ్లారు. అంతలోనే మంగళవారం ఉదయం తండ్రి మృతి చెందడంతో మళ్లీ ఆయన అమెరికా నుండి తిరిగి హైదరాబాదుకు తిరిగి వచ్చిన తర్వాత గురువారం అంత్యక్రియలు చేయనున్నారు. రాంరెడ్డి మృతి పట్ల నియోజకవర్గ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు సంతాపం తెలియజేశారు.

## చదువును ఆయుధంగా మల్చుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విద్యార్థి దశలో కష్టపడితే... జీవితమంతా సుఖ సంతోషాలే బీసీ వసతి గృహ విద్యార్థులకు 'ప్రేరణ' కల్పించిన కలెక్టర్



నిజామాబాద్, ఫిబ్రవరి 03 : విద్యార్థి దశలో ఏకాగ్రతతో ఇష్టపడి చదువుకుంటే, జీవితమంతా సంతోషమయంగా ఉంటుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. విద్యను ఆయుధంగా మల్చుకుని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హితవు పలికారు. ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలకు చెందిన పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు మంగళవారం జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో గల మున్నూరు కాపు కళ్యాణ మండపంలో ప్రేరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్, విద్యార్థులకు పదవ తరగతి వార్షిక పరీక్షల సన్నద్ధతపై దిశా నిర్దేశం చేశారు. ఉన్నత చదువు చదివి జీవితంలో స్థిరపడేందుకు పదవ తరగతి మొదటి మెట్టు అని అన్నారు. ఆరంభంలోనే తప్పటడుగు వేస్తే అది భవిష్యత్తును దెబ్బతీస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా వార్షిక పరీక్షలకు అన్ని విధాలా సంసిద్ధులు కావాలని సూచించారు. ఇదివరకటితో పోలిస్తే ప్రస్తుతం వసతి గృహాల్లో అనేక వసతులు అందుబాటులోకి వచ్చాయని, ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అనేక విధాలుగా తోడ్పాటును అందిస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలన్నారు. వార్షిక పరీక్షలు సమీపించినందున చదువు పైనే దృష్టిని కేంద్రీకరించాలని, ఇతర వ్యాపకాల వైపు దృష్టి పెడితే విలువైన సమయాన్ని కోల్పోతారని అన్నారు. చదువు కష్టంగా అనిపించిన ప్రతీసారి తల్లితండ్రులు పడే కష్టాన్ని గుర్తు చేసుకుని మరింత కసి, పట్టుదలతో చదవాలని హితబోధ చేశారు. పాఠాలను బట్టీ పట్టకుండా విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుంటే అది జీవితాంతం పనికి వస్తుందని ఉద్బోధించారు. ముఖ్యంగా బాలికలు మరింత పట్టుదలతో రాణించాలని, తల్లితండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభను ప్రదర్శిస్తూ జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందించేందుకు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రభుత్వ బడుల్లో చదివే వారు ఏ విషయంలోనూ వెనుకబడి ఉండరని విద్యార్థుల్లో కలెక్టర్ ఆత్మవిశ్వాసం కల్పించారు. చక్కగా చదువుకుని అందరూ 10 గ్రేడ్ పాయింట్స్ సాధించాలని, జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు.

# లోకల్ బాడీ ఎలక్షన్స్ కు వడివడిగా అడుగులు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగనుందా? వరుసగా ఎన్నికలు రానున్నాయా? ముందుగా సర్పంచ్ ఎన్నికలను పూర్తి చేయనున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. అయితే రాష్ట్రంలో ముందుగా మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. మార్చి 17తో మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. సర్పంచ్ల పదవీకాలం ఏప్రిల్ 4 తో ముగియనుంది. ఎంపీటీసీలతో పాటు జడ్పిటిసి లకు సంబంధించిన పదవీకాలం జూన్ వరకు ఉంది. ఈ తరుణంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇప్పటికే ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి నీలం సాహ్ని సిద్ధమని ప్రకటించారు. జిల్లాల యంత్రాంగాలను సిద్ధం చేశారు. ఓటర్ల జాబితా, రిజర్వేషన్ల రూపకల్పన వంటివి ఇప్పటికే దాదాపు ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ దూకుడు చూస్తుంటే మే నెలలో పంచాయితీ, అక్కడ కొద్ది రోజులకే మున్సిపాలిటీ, ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలను పూర్తిచేసేందుకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అర్థమవుతోంది.మరోవైపు రాజకీయ పరిస్థితులను చూస్తుంటే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి శాతం ఉ ంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆశించిన స్థాయిలో పుంజుకోలేదు. ఇటువంటి సమయంలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేస్తే.. మూడు పార్టీల మధ్య పదవుల సర్దుబాటు చేస్తే.. వచ్చే మూడేళ్లలో మూడు పార్టీల శ్రేణులు సమన్వయంతో పనిచేస్తాయి. అందుకే వీలైనంత త్వరగా స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి చేయాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే మూడు పార్టీల నాయకత్వాలు తమ పార్టీల శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే బలం ఉన్నచోట మాత్రమే అభ్యర్థులను రంగంలోకి దించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు ప్రచారం నడుస్తోంది. ప్రజల్లో బలం ఉన్న పార్టీలకు అవకాశం కల్పిస్తారని తెలుస్తోంది. ఒక్క మాటలో చెప్పాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంత మాత్రం బలపడకుండా చూడాలని కూటమి భావిస్తున్నట్లు సమాచారం.అయితే ఈనెల 20 తరువాత దేశవ్యాప్తంగా తొలి విడత జన గణన మొదలవుతుంది. సుమారు ఏడాదిన్నర ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ లెక్కన 2027 లోనే ఎన్నికలు జరపాల్సి ఉంటుంది. అయితే 2018లో చంద్రబాబు చేసిన తప్పిదం అదే. అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు చంద్రబాబు ఆసక్తి చూపలేదు. 2019 ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపించింది. ఇప్పుడు జనాభా గణ న అంటూ వాయిదా వేస్తే మాత్రం కూటమి పార్టీలకు ఇబ్బంది కరం.. పైగా స్థానిక సంస్థల ఎన్నికలకు కులగణన అనేది అడ్డంకి కాదు. ఎందుకంటే ఆర్థిక సంఘం నిధులన్నీ స్థానిక సంస్థల పాలకవర్గాల తోనే సంబంధం ఉంటుంది. పాలకవర్గాలు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు విడుదలవుతాయి. అయితే ఈ పరిణామాలన్నీ చూస్తుంటే మాత్రం వేసవిలో స్థానిక సంస్థల ఎన్నికలు ఖాయం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# అంబటి వ్యాఖ్యలపై చర్చ...



గుంటూరు ఫిబ్రవరి 3, వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇటీవల నడిరోడ్డుపై మీడియా ముందే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై తీవ్ర వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా పెద్ద చర్చకు దారి తీసింది. సభ్యసమాజం ఆమోదించలేని పదజాలంతో చేసిన ఈ వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వాతావరణాన్ని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. అధికారంలో ఉన్న సమయంలో ఇదే తరహా వ్యాఖ్యలు టీడీపీ నేతల నుంచి వచ్చి ఉంటే ఎలా స్పందించేవారు అన్న అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభి జగన్ మోహన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో అర్ధరాత్రి అరెస్ట్ జరిగిన ఉదంతాన్ని పలువురు గుర్తు చేస్తున్నారు. ఆ సందర్భాన్ని ఇప్పుడు అంబటి వ్యవహారంతో పోలుస్తూ, చట్టం అందరికీ సమానంగా వర్తించాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అంబటి వ్యాఖ్యలను సమర్థించే పరిస్థితి వైసీపీలోనే కనిపించడం లేదు. పార్టీ అధినేత తప్ప ఇతర నాయకులు బహిరంగంగా మద్దతు పలకకపోవడం గమనార్హం.వైసీపీలోని పలువురు నేతలు ఆఫ్ ది రికార్డ్గా మాట్లాడుతూ, అంబటి మాట తీరు ఎప్పటి నుంచో ఇలాగే ఉందని, గతంలో కూడా అనేకసార్లు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని అంటున్నారు. కొందరు నేతలు ఆయన ప్రవర్తన పార్టీకి నష్టం కలిగిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో అంబటి వ్యవహారం వ్యక్తిగత అంశం కాదని, పార్టీ అంతర్గత సమస్యల ప్రతిబింబంగా మారిందనే అభిప్రాయం వినిపిస్తోంది.అసలు అంబటి ఈ స్థాయిలో స్పందించడానికి కారణాలేంటి అన్నది మరో కీలక అంశంగా మారింది. బహిరంగంగా చెబుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆయన కారును అడ్డుకోవడమే కారణం కాదని, వైసీపీలోని కొందరు నాయకులే అంటున్నారు. ఇటీవల సత్తెనపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పదవి నుంచి అంబటిని తప్పించడంతో ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గిందనే భావన పెరిగిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ఆయనపై కేసులు నమోదవడం, పార్టీ నుంచి సరైన సహకారం లేకపోవడం కూడా అసంతృప్తికి కారణమైందని అంటున్నారు. ఈ అన్ని అంశాల సమ్మేళనమే అంబటి కోపంగా బయటపడడానికి దారితీసిందని రాజకీయ వర్గాల విశ్లేషణ. ఈ ఘటనతో పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిందని, వైసీపీలో అంతర్గత అసంతృప్తి బయటకు వస్తోందనే చర్చ జరుగుతోంది. ఒక్క అంబటే కాకుండా మరికొందరు నాయకులు కూడా ఇదే తరహా ఆగ్రహంతో ఉన్నప్పటికీ, కొందరు సంయమనం పాటిస్తుండగా మరికొందరు బహిరంగంగా స్పందిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తంగా ఈ పరిణామాలు వైసీపీ భవిష్యత్ రాజకీయ దిశపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

# దాడుల– ప్రతి దాడుల సంస్కృతా...

విజయవాడ, ఫిబ్రవరి 3, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో గత కొన్నేళ్లుగా సాగుతున్న "దాడులు–ప్రతిదాడుల" సంస్కృతిలో ఒక కీలక మార్పు కనిపిస్తోంది. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత జోగి రమేశ్ నివాసంపై జరిగిన దాడి ఉదంతం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే, ఈ ఘటనలో చర్చనీయాంశం దాడి మాత్రమే కాదు.. ఆ దాడి జరిగిన తర్వాత ప్రస్తుత ప్రభుత్వం స్పందించిన తీరు, తీసుకున్న నిర్ణయాలు విశ్లేషకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి.టీడీపీ యువనేత, ప్రస్తుత మంత్రి నారా లోకేశ్పై జోగి రమేశ్ గతంలో చేసిన కొన్ని అనుచిత వ్యాఖ్యలు టీడీపీ శ్రేణుల్లో తీవ్ర ఆగ్రహాన్ని కలిగించాయి. ఈ నేపథ్యంలోనే ఆగ్రహంతో ఊగిపోయిన కొందరు టీడీపీ కార్యకర్తలు, నేతలు జోగి రమేశ్ ఇంటిపై దాడికి దిగారు. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, రాళ్లు రువ్వడం, పెట్రోల్ బాటిళ్లు విసిరి మంటలు రాజేయడం వంటి తీవ్రస్థాయి చర్యలకు పాల్పడ్డారు. ఇది శాంతిభద్రతల పరంగా పెద్ద చర్చకు దారితీసింది.సాధారణంగా అధికార పార్టీ కార్యకర్తలు ప్రతిపక్ష నేతలపై దాడులు చేసినప్పుడు, ప్రభుత్వం వారిని వెనకేసుకొస్తుందనే ముద్ర భారత రాజకీయాల్లో బలంగా ఉంది. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ విషయంలో భిన్నమైన వైఖరిని ప్రదర్శించారు. ఈ దాడి ఘటనను ఆయన తీవ్రంగా పరిగణించడమే కాకుండా, "చట్టం ఎవరికైనా ఒక్కటే.. తప్పు చేసిన వారు మన పార్టీ వారైనా సరే కేసులు నమోదు చేయాల్సిందే" అని పోలీసులను ఆదేశించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. సీఎం ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు 40 మంది టీడీపీ నేతలపై కేసులు నమోదు చేశారు. వీరిలో 11 మంది కీలక నేతలను అరెస్ట్ చేసి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్కు తరలించారు. నిబంధనల ప్రకారం వారికి స్టేషన్ బెయిల్ మంజూరు కావడంతో విడుదలయ్యారు, కానీ చట్టపరమైన ప్రక్రియను మాత్రం ప్రభుత్వం అడ్డుకోలేదు.ఈ ఘటనను విశ్లేషిస్తున్న వారు సహజంగానే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ వైఖరితో పోల్చుతున్నారు. టీడీపీ నేతలు ప్రధానంగా రెండు అంశాలను ఇక్కడ గుర్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ శ్రేణులు దాడి చేసినప్పుడు, బాధ్యులపై చర్యలు తీసుకోవడంమాటఅటుంచి, తిరుగుబాటు చేసిన టీడీపీ నేతలపైనే రివర్స్ కేసులు నమోదయ్యాయని వారు ఆరోపిస్తున్నారు. గతంలో అసభ్య పదజాలంతో ప్రత్యర్థులను దూషించిన వారికి పదవులు కట్టబెట్టడం ద్వారా వైఎస్సార్సీపీ "అరెస్టుల కంటే అభినందనలకే" ప్రాధాన్యత ఇచ్చిందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. దీనికి భిన్నంగా, ఇటీవల వై.ఎస్. భారతిని అసభ్య పదజాలంతో

దూషించిన ఐటీడీపీ కార్యకర్తపై చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకుని, జైలుకు పంపించడం ద్వారా "తప్పు ఎవరి వైపు ఉన్నా క్షమించేది లేదని" సంకేతాలు పంపినట్లయింది.ఒక ప్రభుత్వం తన సొంత కార్యకర్తలపై కేసులు పెట్టడం అనేది రాజకీయంగా సాహసోపేతమైన నిర్ణయమే. దీనివల్ల క్యాడర్లో కొంత అసంతృప్తి కలిగే అవకాశం ఉన్నప్పటికీ, సాధారణ ప్రజల్లో ప్రభుత్వ ప్రతిష్ట పెరుగుతుంది. "రాజకీయాల్లో విమర్శలు ప్రతివిమర్శలు సహజం. కానీ అవి భౌతిక దాడుల వరకు వెళ్లినప్పుడు ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోతే సమాజంలో అరాచకం పెరుగుతుంది. చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వ్యవస్థల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని కలిగిస్తుంది." అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.జోగి రమేశ్ ఇంటిపై దాడి ఘటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒక పాఠంగా నిలిచిపోనుంది. అధికారంలో ఉన్నాం కదా అని చట్టాన్ని అతిక్రమిస్తే, సొంత ప్రభుత్వం కూడా వెనకేసుకురాదని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. గత ప్రభుత్వ తీరుకు, ప్రస్తుత ప్రభుత్వ జవాబుదారీతనానికి మధ్య ఉన్న ఈ వ్యత్యాసమే తమను ప్రజల్లో మెరుగ్గా నిలబెడుతుందని టీడీపీ వర్గాలు భావిస్తున్నాయి. కేవలం ఎన్నికల హామీలే కాకుండా, పరిపాలనలో, శాంతిభద్రతల నిర్వహణలో ఇటువంటి కఠిన నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుకు శుభసూచకం

# ఎంపీల పనితీరుపై సమగ్ర నివేదికలు

గుంటూరు ఫిబ్రవరి 3,తెలుగుదేశం పార్టీలో సంస్థాగత క్రమశిక్షణను మరింత బలోపేతం చేసే దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటివరకు ఎమ్మెల్యేలు, మండల స్థాయి నాయకులకు బాధ్యతలు అప్పగిస్తూ వారి పనితీరును సమీక్షించిన పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు , జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఇప్పుడు అదే విధానాన్ని ఎంపీలకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. ప్రజలతో నేరుగా అనుసంధానం పెంచడం, సమస్యల పరిష్కారంలో వేగం తీసుకురావడం ఈ చర్యల వెనుక ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఎదురైన సమస్యలు, గత 15 నెలల కాలంలో పరిష్కరించిన అంశాలపై ఎంపీలు సమగ్ర నివేదికలు ఇవ్వాల్సి ఉంటుందని పార్టీ ఆదేశించింది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఎలా పరిష్కారమయ్యాయి, ఇంకా పెండింగ్లో ఉన్నవి ఏవి అనే వివరాలను స్పష్టంగా పొందుపరచాలని సూచించింది. దీనితో పాటు పార్లమెంటు సమావేశాల్లో ఎంపీలు ప్రస్తావించిన అంశాలు, వాటికి కేటాయించిన సమయం, ఆ చర్చల వల్ల నియోజకవర్గానికి వచ్చిన ప్రయోజనాలు వంటి విషయాలనూ వివరించాలని కోరుతోంది.ఇకపై ఎమ్మెల్యేలతో నిర్వహిస్తున్న ముఖాముఖి సమావేశాల మాదిరిగానే ఎంపీలతో కూడా నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు పార్టీ సిద్ధమవుతోంది. ఈ సమావేశాల్లో ప్రజలతో నాయకులు ఎలా మమేకమవుతున్నారు, క్షేత్రస్థాయిలో వారి పాత్ర ఎంత ప్రభావవంతంగా ఉంది అనే అంశాలను ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. సమస్యల పరిష్కారంలో చూపిస్తున్న చొరవ, ప్రజల మధ్య గడుపుతున్న సమయం, పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం వంటి విషయాలు ఈ సమీక్షలో కీలకంగా మారనున్నాయి.వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రజల మూడ్ ఎలా మారుతోంది అనే అంశాన్ని కూడా పార్టీ గమనిస్తోంది. అందుకు తగ్గట్టుగా నాయకుల పనితీరును మలచాలనే ఆలోచనతో ఈ సమీక్షా విధానాన్ని అమలు చేస్తున్నారు. ముఖ్యంగా ఎంపీలు, ఎమ్మెల్యేల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న అంతర్గత విభేదాలు పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి వివాదాలకు తావు లేకుండా స్పష్టమైన బాధ్యతలు, సమన్వయం ఉ ండాలనే లక్ష్యంతో ఈ చర్యలు తీసుకుంటున్నారు.

నారా లోకేష్ నేతృత్వంలో పార్టీ భవిష్యత్తు వ్యూహాలు రూపొందుతున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎంపీలతో ప్రత్యక్ష సమావేశాల ద్వారా వారు ఎదుర్కొంటున్న సంస్థాగత సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలన్నది ప్రధాన ఉద్దేశ్యం. ఈ విధానంతో నియోజకవర్గ స్థాయిలో పార్టీ బలం పెరుగుతుందని, నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుందని ఆశిస్తున్నారు. ఎంపీలను కూడా క్రమశిక్షణతో పనిచేసేలా "లైన్లో" పెట్టాలన్న ఈ ప్రయత్నం ఎంతవరకు విజయవంతమవుతుందో రాబోయే రోజుల్లో స్పష్టమవుతుందని రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనిస్తున్నాయి.

# మళ్లీ పడిపోయిన టమాటా ధరలు

తిరుపతి, ఫిబ్రవరి 3,ఆంధ్రప్రదేశ్లో మరోసారి టమాటా ధరలు భారీగా పడిపోయాయి. పంటను మార్కెట్లకు తీసుకొచ్చిన రైతులు ధరలు పతనం కావడంతో ఆందోళనలో ఉన్నారు. కనీసం కోత, రవాణా ఖర్చులకు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు టమాటా కోతను వాయిదా వేశారు. రాష్ట్రంలోని మార్కెట్లలో మరీ దారుణంగా కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉందని చెబుతున్నారు రైతులు.చాయ్ కంటే చీప్.. కేజీ రూ.10లోపే.. ఇది ఏపీలో టమాటా సాగు చేసిన రైతుల పరిస్థితి. గతేడాది కొన్ని నెలల పాటూ సిరులకు కురిపించి టమాటా ధరలు.. ఇప్పుడు మాత్రం దారుణంగా పడిపోయాయి. మార్కెట్లలో కేజీ టమాటా ధర రూ.5 నుంచి రూ.10లోపే ఉంది. ఈ ధరలు దారుణంగా పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటా కోత, రవాణా చేసినందుకు అయ్యే ఖర్చు కూడా మిగలడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను మార్కెట్కు తరలించినా ఉపయోగం లేకుండా పోతోంది అంటున్నారు. ఒక్కసారిగా ధరల పడిపోవడంతో ఆందోళనలో ఉన్నారు. అయితే జనాలు మాత్రం టమాటా ధరలు తగ్గిపోవడంతో పండగ చేసుకుంటున్నారు.జనవరి మొదటి వారంలో టమాటాలు కేజీ రూ.10 నుంచి రూ.20 మధ్య పలికాయి. ఇప్పుడేమో దారుణంగా కేజీ రూ.5 నుంచి రూ.10 మధ్య పలుకుతున్నాయి. అయితే వ్యాపారులు రిటైల్గా కేజీ రూ.15 నుంచి రూ.20కు టమాటాను విక్రయిస్తున్నారు. కానీ దారుణంగా రైతుల నుంచి మాత్రం తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. టమాటా పంట నాణ్యత సరిగా లేకపోవడంతోనే ధరలు తగ్గాయంటున్నారు వ్యాపారులు. మార్కెట్కు వస్తున్న సరుకు మొదట్లో వచ్చినంత నాణ్యత లేదని.. అందుకే తిరస్కరిస్తున్నట్లు చెబుతున్నారు.రైతులు మాత్రం వ్యాపారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ క్రమంలో మార్కెట్లకు వచ్చే టమాటా పంట కూడా తగ్గింది అంటున్నారు. టమాటా ధరలు దారుణంగా పడిపోవడంతో చాలామంది రైతులు కాయల్ని కోసే సాహసం చేయడం లేదు. ఇటీవల టమాటా సాగు చేసిన రైతులది కూడా ఇదే పరిస్థితి. టమాటా సాగు కోసం భారీగా పెట్టుబడులు పెట్టామని.. ఇప్పుడు ధరలు తగ్గడంతో కనీసం ఖర్చులకు కూడా డబ్బులు రావడం లేదంటున్నారు. చాలామంది రైతులు అప్పులబారిన పడుతున్నారట. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు గిట్టుబాటు ధరల దక్కేలా న్యాయం చేయాలని కోరుతున్నారు. కొందరు రైతులు మాత్రం ధరలను చూసి పొరుగు జిల్లాల్లో మార్కెట్లకు తరలిస్తున్నారట. అక్కడైనా సరైన దొరకుతుందనే ఆశతో ఇలా చేస్తున్నారట. మొత్తానికి టమాటా ధరలు తగ్గడంతో రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉన్నారు



# గేమ్ ఛేంజర్ కాబోతున్న ఎర్త్ కారిడార్

నెల్లూరు ఫిబ్రవరి 3, కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్లో ఏపీకి గుడ్ న్యూస్ వినిపించింది. ఏపీతో పాటుగా మరో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. రేర్ ఎర్త్ కారిడార్ ప్రాజెక్టు ఏపీకి గేమ్ ఛేంజర్ అవుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఏపీలోని కోస్టల్ కారిడార్ వెంట ఉన్న ఖనిజాలు, తీర ప్రాంతం, పోర్టులతో అనుసంధానం.. ఏపీని అరుదైన ఖనిజాల అన్వేషణకు గమ్యస్థానంగా మార్చుతుందంటున్నారు. 2026-27 కేంద్ర బడ్జెట్లో నాలుగు రాష్ట్రాలలో రేర్ ఎర్త్ కారిడార్ ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నాలుగు రాష్ట్రాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కూడా ఉంది. దీంతోఏపీ పాలిట గేమ్ ఛేంజర్గా రేర్ ఎర్త్ కారిడార్ మారుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అరుదైన భూలోహాలు, ఖనిజాల అన్వేషణకు హబ్గా మారుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రభుత్వం నుంచి విధానపరంగా, ఆర్థికంగా సహకారం లభించే అవకాశాలు ఉండటంతో ఆంధ్రప్రదేశ్ భారతదేశ ఖనిజ భద్రతను బలోపేతం చేయడంతో పాటు, భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు ఉన్న కోస్టల్ కారిడార్ వెంట ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ఖనిజాల అన్వేషణ కోసం చర్యలు మొదలుపెట్టింది. ఇందుకోసం 16 వేల హెక్టార్ల భూమిని కూడా కేటాయించారు. కోస్టల్ కారిడార్ ప్రాంతంలో మోనజైట్, ఇల్మనైట్, రూటైల్, జిర్కాన్, గార్నెట్ వంటి ఖనిజాలు ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. అరుదైన రేర్ ఎర్త్ ఆక్సైడ్లు (55?60 శాతం) థోరియం (8?10 శాతం) అధిక సాంద్రతలో ఉన్నాయంటున్నారు. ఇవి అడ్వాన్స్ టెక్నాలజీకి సంబంధించిన అత్యంత కీలకమైన ముడి పదార్థాలుగా చెప్తున్నారు.మరోవైపు ఖనిజాల అన్వేషణకు సంబంధించి ఇప్పటికే ఓ ప్రైవేట్ సంస్థకు టెండర్లు కూడా కేటాయించారు. వేయి హెక్టార్ల వరకూ అనుమతి మంజూరు చేశారు. దీనికి అదనంగా మరో నాలుగు వేల హెక్టార్లలో ఖనిజాల అన్వేషణకు కేంద్రం అనుమతి కోరుతున్నట్లు రెవెన్యూ, మైన్స్ అండ్ జియాలజీ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా వెల్లడించారు. అనుమతులు పొందిన తర్వాత మిగిలిన 11 వేల హెక్టార్లలో కార్యకలాపాలను దశలవారీగా వేగవం తం చేస్తామన్నారు. మరోపైపు ఖనిజాల తవ్వకం, ఎగుమతులు మాత్రమే కాకుండా వాటికి అదనపు విలువను జోడించడం ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతం, పోర్టులతో అనుసంధానం, విస్తరిస్తున్న పారిశ్రామిక కారిడార్లు కూడా రేర్ ఎర్త్ కారిడార్కు కలిసివస్తాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు. మొత్తంగా కేంద్రం బడ్జెట్లో ప్రకటించిన ఈ రేర్ ఎర్త్ కారిడార్ ఏపీకి గేమ్ ఛేంజర్గా అవకాశం ఉందని చెప్తున్నారు.

# అరకు కాఫీకి సర్కారీ ప్రమోషన్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 3,ఏపీ ప్రభుత్వం కాఫీ రైతులకు శుభవార్త వినిపించింది. ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కాఫీ రైతులకు తీపికబురు వినిపించింది. అల్లూరి జిల్లాలోని గూడెం కొత్తవీధి, జి. మాడుగుల మండలాల్లో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం రూ.7 కోట్లు నిధులు విడుదల చేసింది. దీంతో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలుపెట్టారు. గూడెం కొత్తవీధిలో మెషీన్ల సాయంతో భూమిని చదును చేస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కాఫీ రైతుల కోసం కీలక నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగుల, గూడెం కొత్త వీధి మండలాలలో వీటిని ఏర్పాటు చేయనున్నారు. వాస్తవానికి ఈ ప్రాంతంలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎప్పుడో ప్రణాళికలు రచించారు. అయితే క్షేత్రస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో ఈ రెండుచోట్లా ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం ఏపీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.7 కోట్లు నిధులు విడుదల చేయడంతో పల్పింగ్ కేంద్రాల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.మరోవైపు ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణం కోసం జాతీయ ఉపాధి హామీ పథకం నిధులు కూడా ఉపయోగిస్తున్నారు. 80 లక్షల రూపాయలతో కాంపౌండ్ వాల్స్ నిర్మించనున్నారు. మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కావటంతో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రాల నిర్మాణ పనులు మొదలయ్యాయి. గూడెం కొత్తవీధిలో ఎకో కాఫీ పల్పింగ్ కేంద్రం వద్ద భూమిని చదును చేసే ప్రక్రియ ప్రారంభించారు. యంత్రాల సాయంతో భూమిని చదును చేస్తున్నారు. గూడెం కొత్తవీధిలో పల్పింగ్ కేంద్రం రక్షణ గోడ కోసం రూ.40 లక్షలు ఖర్చు చేస్తున్నారు.మరోవైపు మన్యం ప్రాంతంలో కాఫీ తోటల సాగు ఎక్కువ. మన్యంలో సుమారుగా రెండున్నర లక్షల ఎకరాలలో కాఫీ పంట సాగవుతోంది. కాఫీ తోటలపై ఆధారపడి లక్షకుపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇక్కడి నుంచి సుమారుగా రూ.200 కోట్ల వరకూ కాఫీ వ్యాపారం జరుగుతోంది.మరోవైపు అరకు కాఫీకి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే

## ఎస్‌బీఐ కాలనీ వాసులకు న్యాయం చేయాలి--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 – నంద్యాల పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ సర్వే నెం 2299లో పది పదిహేను దశాబ్దాలుగా ప్రజలు స్థలాలు కొనుగోలు చేసి మున్సిపాలిటీ అనుమతులతో ఇండ్ల నిర్మాణాలు చేసుకుని నివసిస్తూ ఇంటి కుళాయి పన్నులు చెల్లిస్తున్నారు. అయితే ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా 2018లో ప్రభుత్వం ఈ భూములను వక్ఫ్ ఆస్తులుగా ఏకపక్షంగా ప్రకటించింది. దీంతో అప్పటి నుంచి ఆస్తుల క్రయవిక్రయాలు నిలిచిపోయాయి. ఈ సమస్యపై కాలనీ వాసులు కలెక్టర్‌కు విన్నవించగా తిరిగి తహశీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. దీంతో అర్బన్ తహశీల్దార్ శ్రీనివాసులు వద్ద కాలనీ వాసులు తమ మొరను వెళ్లగక్కారు. ఈ విషయమై ఇప్పటికే రాష్ట్ర మంత్రి ఫారూఖ్‌ను కలిసినా సమస్యకు పరిష్కారం లభించలేదని వారు తెలిపారు. తమ పరిస్థితి తీవ్రమైన మానసిక ఆందోళనకు దారితీస్తోందని వాపోయారు. కాలనీ వాసులు ఇంటి పట్టాలు, గృహ నిర్మాణ అనుమతులు, ఇంటి కుళాయి పన్ను రసీదులు తదితర పత్రాలను పరిశీలన నిమిత్తం అధికారులకు సమర్పించారు. జీఓ ఎంఎస్ నెం 310 తేదీ 26.07.2023 ప్రకారం సర్వే నెం 2299పై ఉన్న ఆంక్షలు తొలగించే అవకాశం ఉన్నప్పటికీ అధికారులు ముందడుగు వేయకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేశారు. నంద్యాలలో న్యాయం జరగని పక్షంలో సమూహంగా ముఖ్యమంత్రి ప్రజాదర్బార్‌కు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు కాలనీ వాసులు తెలిపారు. తహశీల్దార్‌ను కలిసిన వారిలో షేక్ అబ్దుల్ సమద్, ఎస్పీ బాషా, షేక్ మగ్బూల్, రేడియో బాషా, శ్రీనివాసులు, సతీష్, రమణ, హుసేన్, ఖాదర్ బాషా, నాగ శేషు తదితరులు ఉన్నారు.

## నేడు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పోస్టర్ ఆవిష్కరణ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03–మహానంది పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ యాజమాన్యం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన ప్రతికతో పాటు వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 7.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహక అధికారి ఎన్. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం ఆలయం నందలి శ్రీ స్వామివారి కళ్యాణ మండపంలో జరుగుతుందని ఆయన వెల్లడించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయాలి.

### జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి

కర్నూలు, ఫిబ్రవరి : 03 ఫిబ్రవరి 7వ తేదీన ఎమ్మిగనూరు మండలం కలుగోట్ల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యుల చేతుల మీదుగా నిర్వహించనున్న రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి గారు అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మిగనూరు మున్సిపల్ కార్యాలయంలో ముఖ్యమంత్రి పర్యటన సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, రోడ్డు మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీరు, శానిటేషన్, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి రైతులు, ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాఖల మధ్య సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమం సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు తమకు కేటాయించిన విధులను నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి గారు ఆదేశించారు.

# ఆటోనగర్‌లో మౌలిక వసతుల లేవు---

### ఎస్డీపీఐ నాయకుల విమర్శలు---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03–నంద్యాల ఆటోనగర్‌ను ఎస్డీపీఐ నాయకులు సందర్శించి అక్కడి కార్మికుల సమస్యలను తెలుసుకున్నారు. పేరుకే ఆటోనగర్ ఉందని, అభివృద్ధి మాత్రం శూన్యమని ఎస్డీపీఐ నాయకులు విమర్శించారు. ఈ సందర్భంగా ఎస్డీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, నంద్యాల పార్లమెంటు అభ్యర్థి హాఫిజ్ అతావుల్లా ఖాన్ మాట్లాడుతూ, ఆటోనగర్‌లో రోడ్లు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారాయని, మురుగు కాలువలు నిండిపోయి తాగునీరు కూడా లభించని పరిస్థితి



నెలకొందని అన్నారు. కార్మికులు సమస్యలు అడిగితే హామీలే తప్ప పనులు జరగడం లేదని ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తప్పుబట్టారు. ఎస్డీపీఐ నంద్యాల అసెంబ్లీ అధ్యక్షులు ఫాజిల్ దేశాయి మాట్లాడుతూ, గత ముప్పై సంవత్సరాలుగా ప్రభుత్వాలు మారుతున్నా ఆటోనగర్ కార్మికుల దుస్థితి మారలేదన్నారు. దెబ్బతిన్న రోడ్ల వల్ల వాహనాలు రాక వ్యాపారాలు నిలిచిపోయి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. దుమ్ము, దుర్వాసన కారణంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజాస్ హుస్సేన్ మాట్లాడుతూ, రోడ్లపై మురుగు నీరు చేరి దోమల బెడద పెరిగిందని, తాగునీటి సరఫరా విఫలమై కార్మికులు ట్యాంకర్లపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. అధికారుల నిర్లక్ష్యం బాధాకరమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీపీఐ నంద్యాల అసెంబ్లీ కార్యదర్శి మక్బూల్ హుస్సేన్, జిల్లా కార్యదర్శులు సుల్తాన్, కరిముల్లా, జిల్లా కోశాధికారి సమీవుల్లా, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు మాజీద్ ఖాన్, కార్యవర్గ సభ్యులు అత్తర్ హుస్సేన్, ఈశ్వర్ రెడ్డి, రిజ్వాన్ ఆలం, శెక్షావలి తదితరులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ కళల ద్వారానే సాంస్కృతిక వారసత్వం

### .అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ లత.



తిరుపతి చిన్నారులకు సంగీతం, నాట్యం వంటి సంప్రదాయ కళలను నేర్పించడం ద్వారా మనదైన సాంస్కృతిక వారసత్వాన్ని మనం కాపాడుకోగలమని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి.లత పేర్కొన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ సౌజన్యంతో పరిహార సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రామచంద్ర పుష్కరణలో నిర్వహించిన సంగీత లహరి కార్యక్రమంలో ముఖ్య అతిథులు అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి.లత, వ్యాపారవేత్త కె. రాధాకృష్ణ వర్మ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావితరాల వారికి మన సాంస్కృతిక వారసత్వాన్ని అందించడానికి చిన్నారులకు తప్పనిసరిగా మన కళలను నేర్పించాలని సూచించారు. కళల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు మనోవికాసం కూడా సాధ్యమవుతుందని చెప్పారు. సంగీత లహరి కార్యక్రమంలో మొదటగా హైదరాబాద్ కు చెందిన కుమారి అనఘ శ్రీ గాత్రకచేరి అనంతరం జై శేషాచలపతి బృందం నిర్వహించిన వాద్య విన్యాసం ఆహుతులను ఆద్యంతం ఆకట్టుకుంది. కళాకారులను సంస్థ పక్షాన డాక్టర్ లత ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కృష్ణ సింధూజ, టీటీడీ బ్రాడ్ కాస్ట్ ఏ ఇ మల్లం విజయకుమార్ రెడ్డి, పరిహార సేవ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.చక్రపాణి, గాత్ర కళాకారుడు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ పర్యవేక్షణకు ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు

### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, ఫిబ్రవరి 03: ఖచ్చితమైన, రియల్ టైమ్ వాతావరణ పర్యవేక్షణ కోసం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు నిరంతర డేటాను అందిస్తాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలోని ఏపీ ట్రాన్స్ కో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని (ఎచిూ) కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు ఆర్టీజిఎన్ కు అనుసంధానం అయ్యాయన్నారు. ఈ కేంద్రం ద్వారా వర్షపాతం, నేలలో తేమ, వాతావరణ పీడనం, గాలి, ఉష్ణోగ్రత వంటి వివరాలు ఆటోమేటిక్ గా ఆన్లైన్ లో నమోదు అవుతాయని తెలిపారు. తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి, వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడానికి సంబంధిత వాతావరణ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కేంద్రానికి సంబంధించిన యంత్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఓ భారతి, డివైఎస్ఓ భాస్కర్, రామాంజనేయులు, ఏ ఎస్ ఓ సరళ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీశైలం శ్రీశ్రీశ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్నదాన సత్రానికి 60 క్వింటాళ్ల బియ్యం అందజేత

ఎమ్మిగనూరు ఫిబ్రవరి 3 మహా శివరాత్రి సందర్భంగా శ్రీశైలం శ్రీశ్రీశ్రీ అఖిలభారత కురువంశ నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం నిమిత్తం ఎమ్మిగనూరు శ్రీ భీరలింగేశ్వర వెల్ఫేర్ కమిటీ మరియు కురువ సంఘం ఆధ్వర్యంలో 60 క్వింటాళ్ల బియ్యం అందజేయడం జరిగింది.×ఈ బియ్యాన్ని ఎమ్మిగనూరు మండలం చెన్నాపురం, ఎర్రకోట, గోనేగండ్ల మండలం పిల్లిగుండ్ల, అల్వాల గ్రామాల నుంచి భక్తుల సహకారంతో సేకరించగా, మొత్తం 120 బియ్యం బస్తాలను ఈరోజు రెండు వాహనాల ద్వారా శ్రీశైలానికి తరలించారు.×ఈ పవిత్ర కార్యానికి సహకరించిన దాతలకు, కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసార్×ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు మండలం కురువ సంఘం నాయకులు ఎర్రకోట అంపయ్య,ఐ ు ఉరుకుందు, డిగ్రీ కాలేజ్ మద్దిలేటి సార్ మసీద్ పురం ఆంజనేయ్య, ఎర్రకోట వెంకటరాముడు,బాపురం వెంకటాయుడు,బోడబండ హనుమంతు,ఐ రాము,మెకానిక్ బీరప్ప,ఐ.ఉ.మల్లయ్య, మేకల మల్లయ్య,ఎ.వెంకటేశు,గార్లదిన్నె రామంజి,దైనందిన్నె ఈరన్న,ఎర్రకోట నాగేష గోనెగండ్ల మండలం కురువ సంఘము నాయకులు పిల్లిగుండ్ల నాగన్న, కి.రంగస్వామి,ఎ శ్రీను, రామకృష్ణ,ఎ.మద్దిలేటి సర్పంచు (బాషా), గోపాలు,ఐ. నరసింహుడు,ఐ.బల రాముడు తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రికి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03:శ్రీశైలం నందు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ (ఐపీఎస్) పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన అనంతరం శ్రీశైలంలో రింగ్ రోడ్ పార్కింగ్ ప్రాంతాలు, ఆర్టీసీ బస్టాండ్, సాక్షి గణపతి, హటకేశ్వరం, సుండిపెంట లింగాలగట్టు తదితర ప్రాంతాలను పరిశీలించి తగిన సూచనలు చేశారు. లింగాలగట్టు స్నానఘాట్లను కూడా తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. భక్తులు పోలీసుల సూచనలు పాటిస్తూ నిర్దేశిత పార్కింగ్ ప్రాంతాల్లోనే వాహనాలు నిలపాలని, రోడ్డు ఇరువైపులా వాహనాలు పార్క్ చేయరాదని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

## డెంటల్ ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03:నంద్యాల పట్టణంలో డెంటల్ సర్జన్స్ అసోసియేషన్ మరియు ఒమేగా హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 4, 2026 బుధవారం డెంటల్ ఆరోగ్యంపై అవగాహన కల్పించే కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించనున్నారు. ప్రజల్లో దంత ఆరోగ్య ప్రాధాన్యతపై అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీ ఉదయం 9:30 గంటలకు స్థానిక శ్రీనివాస సెంటర్ నుంచి ప్రారంభమై పద్మావతి నగర్ ఆర్చ్ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా డాక్టర్లు గురు ప్రసాద్, సంతోష్, శ్రావణ్, సునీల్ కలిసి నంద్యాలలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్ఎండీ ఫిరోజ్‌ను మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ డెంటల్ అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## పశు వసతి గృహాల ఏర్పాటు చేయాలి--

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 03 :జిల్లాలో ప్రమాదాల్లో గాయపడిన జంతువుల సంరక్షణకు అవసరమైన పశు వసతి గృహాల ఏర్పాటుకు తగిన స్థల సేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం డిస్ట్రిక్ట్ యానిమల్ వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 30 వేల వీధి కుక్కలు ఉన్నాయని, వాటి నియంత్రణకు జనన నియంత్రణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా వీధి కుక్కలకు స్టెరిలైజేషన్, వాక్సినేషన్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. గతంలో కుక్కల కాటుతో జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు అవసరమని తెలిపారు. అక్రమ గోవధశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పట్టుబడిన అక్రమ కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**